క్లుప్తంగా

డైరెక్టర్ పదవికి రాజీనామా


ఎస్.రవికుమార్

మర్రిపాలెం: రాష్ట్ర భట్రరాజు డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి 49వ వార్డుకు చెందిన ఎస్.రవికుమార్ రాజీనామా చేశారు. వైఎస్సార్‌సీపీ ఓటమి నేపథ్యంలో తన నామినేటెడ్ పదవికి నైతిక బాధ్యతగా రాజీనామా చేసినట్టు ఆయన సోమవారం తెలిపారు. ఈ మేరకు స్పెషల్ చీఫ్ సెక్రటరీకి తన రాజీనామా పత్రాన్ని పంపినట్టు రవికుమార్ చెప్పారు.

వర్ధమాన గాయకులకు సత్కారం


గాయకులను అభినందిస్తున్న నిర్వాహకులు

మల్కాపురం: కరుణాంజలి మ్యూజికల్స్ ఆధ్వర్యంలో సినీ సంగీత దర్శకులు ఇళయరాజా జన్మదినాన్ని పురస్కరించుకుని వర్ధమాన గాయకులకు పాటల పోటీ నిర్వహించారు. స్థానికంగా జరిగిన ఈ పోటీల్లో హైదరాబాద్, అరకు,విజయవాడ,విశాఖ,అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి సుమారు వంద మంది మెయిల్ అండ్ ఫీమేల్ వర్ధమాన గాయకులు పాల్గొని ఇళయరాజా చిత్రాలకు సంబంధించిన పలు పాటలతో ఆహుతులను అలరించారు. అనంతరం తమ గేయాల ద్వారా ప్రేక్షకులను ఉర్రూతలు ఊగించిన గాయనీ గాయకులను నిర్వాహకులు అభినందించారు.

ముగిసిన రాచపోలమాంబ ఆలయ వార్షికోత్సవాలు


అన్నసమారాధనంలో పాల్గొన్న భక్తులు

అల్లిపురం: అల్లిపురం వాసుల ఆరాధ్య దైవం శ్రీరాచపోలమాంబ ఆలయ వార్షికోత్సవాలు సోమవారం ముగిశాయి. శనివారం ప్రారంభమైన ఈ ఉత్సవాలలో భాగంగా సోమవారం ముగింపు సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు.

కొత్తమ్మతల్లికి పసుపు, కుంకుమ సమర్పణ నేడు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లికి మంగళవారం పసుపు, కుంకుమ సమర్పించనున్నారు. ఈ సందర్భంగా సంతపేట, కొత్తపేట, చిట్టివలస కార్మికవాడ, విల్సన్‌పేట, వెలంపేట తదితర గ్రామాల ప్రజలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకోనున్నారు. ఇందుకు సంబంధించి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్లు ఏర్పాటు చేసి భక్తులకు తాగునీరు, ప్రసాదం, మజ్జిగ పంపిణీ చేయనున్నారు. కొత్తపేట, సంతపేట గ్రామాల నుంచి అమ్మవారి ఆలయం వరకు బాణసంచా, నేలవేషాలు, పులివేషాలు, సాముగరిడీ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఆలయాన్ని సుందరంగా అలంకరించారు.

వృద్ధులకు వితరణ

సీతంపేట: బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్, జూనియర్ ఆర్టిస్టుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సినీ నటుడు నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథపురంలోని ప్రియదర్శిని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంచి పెట్టారు. కార్యక్రమంలో బాలకృష్ణ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఆదినారాయణ, జూనియర్ ఆర్టిస్టులు బి.వేళంగిణి, జి.జానకీరామ్, వి.అప్పలరాజు, ఎం.విజయ్, పి.త్రినాథరావు, డి.అప్పలరాజు, ఎ.సురేష్, కె.నాగార్జున, సిహెచ్.అరుణ, సింగర్ మల్లిక, ఆశ్రమ ఇన్‌చార్జులు కె.ఎ.గ్లోరి, ఎం.డి.గులాబ్ జాన్ పాల్గొన్నారు.

జంక్షన్ జామ్

- రామాటాకీస్ కూడలిలో ట్రాఫిక్ తంటాలు
- నిత్యం ఇదే సమస్య
- అసహనం వ్యక్తం చేస్తున్న వాహన చోదకులు


రామాటాకీస్ జంక్షన్‌లో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

సీతంపేట: రామాటాకీస్ జంక్షన్‌లో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో వాహన చోదకులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఇటు మద్దిలపాలెం, అటు సీతమ్మధార వెళ్లడానికి రామాటాకీస్ కూడలి మీదుగా ప్రయాణించాల్సిందే. ఈ కూడలిలో నిత్యం ట్రాఫిక్ స్తంభించడంతో వాహన చోదకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రామాటాకీస్ కూడలిలో స్టాపర్లు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి రోడ్డులో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పదుల సంఖ్యలో బారులు తీరడం, బస్సు ఎక్కడానికి వచ్చే వారి డ్రాపింగ్ వెహికల్స్, లగేజీతో నిత్యం రహదారి రద్దీగా ఉంటోంది. దీనికితోడు రామాటాకీస్ జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రించే పోలీసులు సరిగా ఉండకపోవడం, ఇక్కడ ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులోకి తీసుకురాక పోవడంతో ఇష్టానుసారంగా ప్రయాణాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. ట్రాఫిక్ అధికారులు దృష్టి సారించి రామాటాకీస్ కూడలి, ప్రభుత్వ కంటి ఆస్పత్రి మార్గంలో సాఫీగా ప్రయాణాలు సాగించేలా తగు చర్యలు తీసుకోవాలని పలువురు వాహన చోదకులు కోరుతున్నారు.

ఎల్‌అండ్‌టీ ఎడ్యుటెక్ శిక్షణ ప్రారంభం


శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

సీతంపేట: పరిశ్రమల్లో ఉద్యోగావకాశాలు పొందేందుకు అవసరమైన నైపుణ్యాలు అందించడానికి బుల్లయ్య కళాశాల, ఎల్ అంట్ టీ ఎడ్యుటెక్ శిక్షణ సంస్థతో ఎంవోయూ చేసుకున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా ఎల్ అండ్ టీ సంస్థ సోమవారం నుంచి 2024-25 బ్యాచ్ విద్యార్థులకు శిక్షణ తరగతులు ప్రారంభించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి.దీపక్ చౌదరి మాట్లాడుతూ ఎంప్లాయబిలిటీ స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లో అడ్వాన్స్‌డ్ డేటా స్ట్రక్చర్స్, డేటా ఇంజినీరింగ్ ఉపయోగించి పైథాన్, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, సివిల్ కోర్ ఇంజినీరింగ్ అంశాల్లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి విద్యా సంస్థ, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించనున్నట్టు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు విద్యార్థులు సొంతం చేసుకుని సులువుగా ఉద్యోగావకాశాలు పొందడానికి వీలు కలుగుతుందని చెప్పారు. ఇంటర్వ్యూలకు ఆత్మవిశ్వాసంతో హాజరయ్యేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎల్ అండ్ టీ అధికారులు, కళాశాల వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విష్ణుకుమార్‌రాజును కలిసిన అధికారులు, నాయకులు


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న తహసీల్దార్ శ్రీరామ్మూర్తి, డీటీ, సిబ్బంది

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన పెనుమత్స విష్ణుకుమార్‌రాజును బాలయ్య శాస్త్రిలేఅవుట్‌లోని బీజేపీ కార్యాలయంలో సోమవారం పలు శాఖల అధికారులు, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అడ్మిన్ ఏడీసీపీ ఎం.ఆర్.కె.రాజు, ద్వారకా ఏసీపీ రాంబాబు, సీఐ ఎస్.రమేష్, టూటౌన్ సీఐ తిరుమలరావు, త్రీ టౌన్ సీఐ పార్థసారథి, జీవీఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్, సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ జి.శ్రీరామ్మూర్తి, డిప్యూటీ తహసీల్దార్ ఎ.త్రినాథ్, ఎలక్షన్ డీటీ కోరాడ రామలక్ష్మి, ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్వోలు, విమ్స్ డైరెక్టర్ రాంబాబు, ఎస్ఐలు, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు, పలువురు ప్రభుత్వ అధికారులు, జనసేన పార్టీ నాయకుడు రఘు, టీడీపీ, బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

మురళీనగర్: బీజేపీ కార్యాలయంలో పి.విష్ణుకుమార్‌రాజును మురళీనగర్ వైశాలి స్పోర్ట్స్ పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఆధ్వర్యంలో మురళీనగర్‌లోని వివిధ పార్కుల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, వాకర్స్ క్లబ్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విస్తృతంగా బీసీజీ టీకాలు


వెంకటేశ్వరమెట్ట గ్రంథాలయం ఆవరణలో బీసీజీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

అల్లిపురం: కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అడల్ట్ బీసీజీ టీకాలు వేసే కార్యక్రమం సోమవారం చురుగ్గా సాగింది. వార్డుల్లోని సచివాలయాల పరిధిలో 60 సంవత్సరాలు దాటిన వారు, షుగర్ వ్యాధిగ్రస్తులకు క్షయ వ్యాధి వ్యాపించకుండా ముందస్తుగా బీసీజీ టీకాలు వేస్తున్నట్లు ఆరోగ్య సిబ్బంది తెలిపారు. కొబ్బరితోట సచివాలయం పరిధిలో 20 మందికి ఈ టీకాలు వేసినట్లు ఏఎన్ఎం సుభాషిణి, ఆశ వర్కర్ పార్వతి తెలిపారు.

- వెంకటేశ్వరమెట్ట-1, బంగారుమెట్ట సచివాలయాల పరిధిలో 35 మందికి బీసీజీ టీకాలు వేశారు. వెంకటేశ్వరమెట్ట, శ్రీవెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఏఎన్ఎం భారతి, మదీనమ్మ, ఆశ వర్కర్లు అనురాధ, బుద్ధ లీలావతి పాల్గొని బీసీజీ టీకాలపై అవగాహన కల్పించారు.

ముగిసిన పవర్ లిఫ్టింగ్ పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అండిబోయిన లక్ష్మి తదితరులు

పెదగంట్యాడ: ఏపీ స్టేట్ పవర్ లిఫ్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అండిబోయిన అప్పారావు, కార్యదర్శి మర్ల భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన పవర్ లిఫ్టింగ్ పోటీలు ముగిశాయి. మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని సీడబ్ల్యూసీలో ఈ నెల 8, 9 తేదీల్లో థర్డ్ ఏపీ స్టేట్ డెడ్లిఫ్ట్ చాంపియన్ షిప్-2024, ఫోర్త్ ఏపీ స్టేట్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్-2024, సిక్త్ ఏపీ స్టేట్ బ్రెంచ్ ప్రెస్ చాంపియన్ షిప్-2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. సబ్ జూనియర్స్, సీనియర్స్, మాస్టర్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జీవీవీ సత్యనారాయణ, రమేష్ యాదవ్ విజేతలుగా నిలిచారు. విజేతలకు గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్స్‌తో పాటు సర్టిఫికెట్లను రాష్ట్ర యాత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అండిబోయిన లక్ష్మి, శ్రీలత, ఏఎస్ఐ అనూరాధ అందజేశారు. కార్యక్రమంలో గుత్తల రాంబాబు, సత్యారావు, అప్పారావు, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలతో తీరం ఘోరం


రుషికొండ బీచ్‌లో పెద్ద ఎత్తున దర్శనమిస్తున్న వ్యర్థాలు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్ వ్యర్థాలతో అధ్వానంగా తయారైంది. ఇక్కడి బీచ్‌ను ఇష్టపడని వారుండరు. విశాఖ వాసులతోపాటు దేశ విదేశీయులు కూడా రుషికొండ బీచ్ అంటే మక్కువ చూపుతారు. ఈ బీచ్ బ్లూ ఫ్లాగ్ గుర్తింపు కూడా పొందింది. విశాలమైన తీరం, అద్దాన్ని ప్రతిబింబించేలా తీర ప్రాంతం ఉండటంతో రోజూ వేలాది సంఖ్యలో పర్యాటకులు సందర్శిస్తుంటారు. శని, ఆది వారాలతోపాటు ఇతర సెలవు దినాల్లో బీచ్‌కు చేరుకునే పర్యాటకుల సంఖ్య అధికంగా ఉంటుంది. అటువంటి గుర్తింపు పొందిన తీరానికి పాలిథిన్ కవర్లు, మట్టికుండలు, వాడేసిన దుస్తులు కొట్టుకు రావడంతో పర్యాటకులు అసహనం వ్యక్తం చేశారు. బీచ్ పొడవునా వ్యర్థాలు ఉండటంతో ఇక్కడ గడిపేందుకు వచ్చిన పర్యాటకులు దుర్వాసన భరించలేక వెనుదిరుగుతున్నారు. ప్రపంచ స్థాయి గుర్తింపు పొందిన ఈ బీచ్ అధికారుల నిర్లక్ష్యంతో కళ తప్పుతోందని పర్యాటకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. పూర్తి వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయాలన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి


వృద్ధుడి మృతదేహం

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో అనారోగ్యంతో పడి ఉన్న గుర్తు తెలియని ఓ వృద్ధుడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా.. గత నెల 31న విశాఖ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాం నంబర్ 3 వద్ద ఓ వృద్ధుడు అనారోగ్యంతో, అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. ఇతడిని గమనించిన జీఆర్పీ సిబ్బంది వెంటనే 108లో కేజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఇతడి వయసు సుమారు 60-65 ఏళ్లు ఉంటుందని, ఎత్తు 5.4 అడుగులు, నలుపు రంగు శరీరం, సిమెంట్ కలర్ టీ షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు. విశాఖపట్నం జీఆర్పీ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి వద్ద ఏ విధమైన ఆధారం లేదని, ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వేస్టేషన్‌లో జీఆర్పీ సిబ్బందిని స్వయంగా లేదా 98664 13487, 94406 27547 నంబర్లకు కాల్ చేసి గానీ తెలియజేయాలని ఎస్ఐ శ్రీనివాసరావు కోరారు.

ప్రధాని హామీలను నిలబెట్టుకోవాలి


దీక్ష శిబిరంలో పాల్గొన్న నాయకులు

అగనంపూడి: తిరుపతి ఎన్నికల ప్రచార సభలో ఇచ్చిన హామీలను ప్రధానమంత్రి మోదీ నిలబెట్టుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు కోరారు. ఆ దిశగా సంకీర్ణ ప్రభుత్వంలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీల అధినేతలు ప్రధానిపై ఒత్తిడి తేవాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే దీక్షల్లో 1,215వ రోజు, సోమవారం వారు పాల్గొని మాట్లాడారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించడం, విశాఖ రైల్వే జోన్, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం, వెనుకబడిన జిల్లాల అభివృద్ధిపై ప్రకటన చేయాలన్నారు. విభజన చట్టంలోని హామీలను వెంటనే అమలు చేయాలని వారు కోరారు. శిబిరంలో సింటర్ ప్లాంట్ కార్మికులతో పాటు నాయకులు ఎం.రామారావు, ఎస్.రామచంద్రరావు, నరేంద్ర, శ్రీనివాస్ నాయుడు, జగదీష్, సత్యనారాయణ, కామేశ్వరరావు, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


స్టీల్‌ప్లాంట్ సీజీఎం సోథీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ విశాఖ స్టీల్ ప్రాజెక్ట్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద సోమవారం ధర్నా చేశారు. బయోమెట్రిక్ విధానం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున పాత పద్ధతిని కొనసాగించాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఆరు నెలలుగా సకాలంలో జీతాలు చెల్లించటం లేదని, ప్రతీ నెలా 7వ తేదీలోగా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. స్కిల్డ్, సెమీ స్కిల్డ్ కార్మికులకు ఈఎస్ఐ లేకపోవటం వల్ల కార్మికులు నష్టపోతున్నారని, వారికి మెడికల్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని అన్నారు. అందరు కాంట్రాక్టర్లు పీఎఫ్, ఈఎస్ఐ విధిగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సీజీఎం (వర్క్స్) ఎ.కె. సోథీకి వినతిపత్రం అందజేశారు. స్టీల్ ఏఐటీయూసీ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్.రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ తొలేళ్ల సంబరం


మొక్కులు తీర్చుకోవడానికి భక్తులు తీసుకొచ్చిన పైడిమాంబ అమ్మవారి ప్రతిమలు

సీతంపేట: సీతంపేట గ్రామదేవత పైడిమాంబ అమ్మవారి పండగలో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు, భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు తీర్చుకోవడానికి అమ్మవారి ప్రతిమలు(ఘటాలు) దొండపర్తి ఎరుకుమాంబ గుడి నుంచి భక్తులు తలపై పెట్టుకుని సీతంపేట రాధాకృష్ణ ఆలయం వరకు తీసుకువచ్చారు. అక్కడ నుంచి నాయుడు వీధిలో ఉన్న అమ్మవారి సదరం పట్టుకు తీసుకెళ్లి రాత్రంతా పూజలు చేశారు.

నేడు ప్రధాన పండగ

సీతంపేట గ్రామదేవత పైడిమాంబ అమ్మవారి ప్రధాన పండగ మహోత్సవం మంగళవారం కనుల పండువగా జరిపేందుకు శ్రీకృష్ణ యువజన సేవా సంఘం అన్ని ఏర్పాట్లు చేసింది. అమ్మవారు కొలువైన త్రిశక్తి ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలమాలలు, వేపమండలతో చూడముచ్చటగా అలంకరించారు. మంగళవారం ఉదయం 5 గంటల నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకోవచ్చని ఉత్సవ కమిటీ చైర్మన్ ఇసరపు సురేష్‌బాబు తెలిపారు. భక్తుల గోత్రనామాలతో పూజలు చేస్తామని చెప్పారు. సాయంత్రం 5 గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అమ్మవారి అనుపు ఊరేగింపు జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండగ మహోత్సవాన్ని జయప్రదం చేయాలని ఉత్సవ కమిటీ కోరింది.

ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న ఏపీయూఎస్ నేత అరుణ్‌కుమార్

సీతమ్మధార: ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని, డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో ఉన్న 25 వేల ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఏపీయూఎస్) జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి త్రినాథమూర్తి డిమాండ్ చేశారు. సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని ఎస్ఎంసీ హైస్కూల్‌లో సోమవారం సంఘ జిల్లా అభ్యాస వర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు విద్యార్థుల్లో జాతీయ భావాలు నింపడానికి తమ సంఘం కృషి చేస్తోందన్నారు. ఇంగ్లిష్ మీడియంతోపాటు తెలుగు మీడియంను సమాంతరంగా కొనసాగించాలని, మున్సిపల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో పర్యటన కార్యకర్త రామునాయుడు, రాష్ట్ర కార్యదర్శి ఎం.పి.శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారావు, జిల్లా మహిళా కార్యదర్శి రామలక్ష్మి, జిల్లా కార్యవర్గ సభ్యులు మామిడి కిరణ్‌కుమార్, ఎ.సురేష్, ఈశ్వరరావు, కె.సన్యాసినాయుడు, బి.సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా రవాణా వినియోగంతో కాలుష్య నియంత్రణ


ఆర్టీసీ బస్సులో కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒక్క రోజైనా ప్రజా రవాణా వినియోగించడం ద్వారా విశాఖ నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అన్నారు. ఆమె తమ క్యాంపు కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా జీవీఎంసీ యంత్రాంగం వారంలో ఒక రోజు ప్రజా రవాణాను వినియోగించాలని గతంలో నిర్ణయించామన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించాలని కోరారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ ఆస్థాన మండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యావవాచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠంపజేసి అష్టోత్తరం పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం


కొత్త కార్యవర్గాన్ని అభినందిస్తున్న గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి

మహారాణిపేట: వైశాఖి డాల్ఫిన్ బోటు ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. రెండు సంవత్సరాల పాటు ఈ కార్యవర్గం అధికారంలో ఉంటుంది. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా సిహెచ్.సత్యనారాయణమూర్తి, అధ్యక్షుడిగా సిహెచ్.వీర్రాజు, ప్రధాన కార్యదర్శిగా ఒ.చిన్నా, కోశాధికారిగా బి.భాస్కరరావు, ఉపాధ్యక్షులుగా సిహెచ్.బాబ్జీ, ఎస్.సత్యనారాయణ, డి.నాగరాజు, ఎం.రాము, సహాయ కార్యదర్శులుగా కె.నానాజీ, సిహెచ్.రాజశేఖర్, ఎం.రాంబాబు, ఎం.అప్పన్న ఎన్నికయ్యారు.